క్లుప్తంగా

బదిలీ టీచర్లకు జీతాలు చెల్లించాలి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన బదిలీల్లో బదిలీ అయిన, పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు కేటాయించి సత్వరమే జీతాలు చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. ఈ విషయమై శనివారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బదిలీ కాబడి ఇంకా పాత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేసి వారి వారి స్థానాలలో జాయిన్ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ఈ ఏడాది పదవ తరగతి స్పాట్ వ్యాల్యుయేషన్‌కు సంబంధించిన నిధులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు యాదవ్, జిల్లా అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నంద్యాల రాజగోపాల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

'రావూరి'కి ఘన నివాళి




రావూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్: జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్న రావూరి భరద్వాజ సాహితీ లబ్ధప్రతిష్ఠులని వైఎస్సార్ కడపజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. రావూరి భరద్వాజ 99వ జయంతిని శనివారం కడపలోని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. వ్యవసాయ కూలీగా అనేక కష్టాలను అధిగమించి కేవలం 7వ తరగతి వరకే చదువుకున్న రావూరి భరద్వాజ గొప్ప సాహిత్యాన్ని సృష్టించి దేశంలోనే అత్యున్నత పురస్కారాన్ని అందుకున్నారని తెలిపారు. ఆయన కలం నుంచి 200కు పైగా కథలు, నవలలు, నాటకాలు, పద్యాలు, స్మృతి కావ్యాలు వెలువడ్డాయన్నారు. ఆయన రాసిన ‘పాకుడు రాళ్లు’ నవలకు జ్ఞానపీఠ సత్కారం లభించిందన్నారు. కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి , విశ్రాంత డిప్యూటీ ఈఓ నాగమునిరెడ్డి, ఏవీఎస్ రాజు, నారాయణ, వెంకటసుబ్బయ్య, సుభాన్, రామకృష్ణ, సుబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఔట్‌సోర్సింగ్ సంఘం రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ గంగాంజనేయులు తెలిపారు. శనివారం ఆర్టీసీ కడప జోనల్ వర్క్‌షాప్‌లో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు గేట్ మీటింగ్, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఆర్టీసీ యాజమాన్యం ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. ఆర్టీసీ కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్‌లో ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను చేర్చాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు విజయ్, కార్యదర్శి స్టీఫెన్, కోశాధికారి శ్రీనివాసులు, వర్క్‌షాప్ కమిటీ సభ్యులు హరిప్రసాద్, సురేష్, మహేష్, నారాయణ, ప్రసాద్, శంకర్, శాంతి, చిన్నక్క తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో మెలకువలు ముఖ్యం



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్

కడప అగ్రికల్చర్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు వర్షాభావాన్ని దృష్టిలో ఉంచుకుని వాతావరణానికి అనువైన పంటలను సాగు చేసుకోవాలని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్ రెడ్డి సూచించారు. గురువారం ఊటుకూరు వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో శనివారం కడప, అన్నమయ్య జిల్లాలోని వ్యవసాయ ఉప సంచాలకులకు శిక్షణ, సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. అలాగే జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ , కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య , కేవీకే శాస్త్రవేత్తలు మాధురి, శ్రీవల్లి, భాగవతప్రియులు మాట్లాడారు. ఖరీఫ్ సీజన్లో రైతులు సాగు చేసే పంటలు వాటిలో యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ, ఎరువుల యాజమాన్యం తదితర విషయాలను వివరించారు ఈ కార్యక్రమంలో ఆత్మ పిడి విజయలక్ష్మి కడప అన్నమయ్య జిల్లాల ఏడీఏలు పాల్గొన్నారు.

చీటింగ్ మేనిఫెస్టోతో బాబు పాలనకు చరమగీతం

- బాబు పాలనపై జనం అసంతృప్తి
- జగన్‌కు పెరుగుతున్న జనాదరణ
- తట్టుకోలేకపోతున్న కూటమి ప్రభుత్వం
- రాజంపేట సభలో సురేష్‌బాబు, ఆకేపాటి



రీకాలింగ్ మేనిఫెస్టో బార్ కోడ్ విడుదల చేస్తున్న ఆకేపాటి, సురేష్‌బాబు, తదితరులు

రాజంపేట: సార్వత్రిక ఎన్నికల ముందు ప్రజలను చీటింగ్ చేసేలా మ్యానిఫెస్టో తీసుకొచ్చి.. ఇపుడు అమలు చేయకపోవడంతో చంద్రబాబు పాలనకు చరమగీతం పాడే దిశగా ప్రజలు అడుగులు వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా పరిశీలకుడు, కడప మేయర్ సురేష్‌బాబు అన్నారు. స్థానిక ఆర్‌ఎస్‌రోడ్డులోని జీఎంఎస్ కళ్యాణమండపంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకేపాటి అనిల్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ ఏడాదికే చంద్రబాబు పాలనపై విసిగెత్తి పోయారని, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జనాదరణ చూసి కూటమి నాయకులు తట్టుకోలేకపోతున్నారన్నారు. అక్రమ కేసులు పెట్టి అత్యంత జనాదరణ కలిగిన నేత జగన్‌మోహన్‌రెడ్డిని అడ్డుకోవాలని సీఎం చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలు చాలా ఉన్నాయన్నారు. ఏడాదికే కూటమి ప్రభుత్వం అపహాస్యంపాలైందని, తీవ్ర ప్రజావ్యతిరేకత మూటకట్టుకుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనువాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, రామస్వామిరెడ్డి, శివారెడ్డి, దొడ్డిపల్లె భాస్కర్‌రాజు, కృష్ణారావు యాదవ్, వడ్డె రమణ, టక్కోలు శివారెడ్డి, గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, గాలివీటి వివేకానందరెడ్డి, వరదరాజు(బాబు), ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, చొప్పా ఎల్లారెడ్డి, గడికోట సుబ్బారెడ్డి, ఇస్మాయిల్, వీరనాగిరెడ్డి, వడ్డెరమణ, అబ్దుల్లా, నాయబ్ రసూల్, సురేఖ మాట్లాడారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం: ఆకేపాటి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన అధ్వానంగా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ రీకాలింగ్ మేనిఫెస్టో ద్వారా చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు తెలియచేయాలన్నారు. ప్రజలందరి సెల్‌లో అప్‌లోడ్ చేసేలా చూడాలన్నారు. రాష్ట్రమంతటా కూటమిగాలి వీస్తే రాజంపేటలో మాత్రం వైఎస్సార్‌సీపీ గాలి వీసిందన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామనిలాయన భరోసా ఇచ్చారు. వందకుపైగా చంద్రబాబు ఇచ్చిన హామీల అమలు ప్రశ్నార్థకరమే అన్న భావన ప్రజల్లో నాటుకుపోయిందని తెలిపారు. వైఎస్సార్‌సీపీలో ఇటీవల పెద్ద ఎత్తున క్యాడర్‌కు పదవులను కట్టబెట్టారని, సమష్టి కృషితో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. చంద్రబాబు పాలనను ఎండగట్టే విధంగా క్యాడర్ పనిచేయాలన్నారు.

బాబు మోసపూరిత మేనిఫెస్టోను గుర్తు చేద్దాం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి
- 14 నుంచి మండల స్థాయి సమావేశాలు
- మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి, రఘునాథరెడ్డి

మైదుకూరు : చంద్రబాబు మోసపూరిత మేనిఫెస్టోను వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ప్రజలకు గుర్తు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అధ్యక్షతన పార్టీ మైదుకూరు నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజలకు గుర్తు చేసే క్యూఆర్ కోడ్ ఉన్న పోస్టర్లను వారు ఆవిష్కరించారు. అనంతరం రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు మోసపూరిత వాగ్దానాల కారణంగా ఏ కుటుంబానికి ఎంత నష్టం జరిగింది.. ఎంత మేరకు మోసపోయామనే విషయం ప్రజలకు తెలుసు అని అన్నారు. కానీ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు చంద్రబాబు మోసాన్ని గుర్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఎలా ఉన్నది.. ఇప్పుడు చంద్రబాబు పాలన ఎలా ఉంది అనేది వివరించాలని సూచించారు. చంద్రబాబుకు రాష్ట్రంలో ఎల్లో మీడియా ఎంతో సహకరిస్తోందని, అబద్దాలను నిజంగా మారుస్తూ ప్రజలకు చేరవేస్తున్నారని ఆరోపించారు. అందువల్ల ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే బాధ్యత తీసుకోవాలన్నారు. 2014లో 695 హామీలు ఇచ్చి చంద్రబాబు అధికారంలోకి వచ్చి అవి నెరవేర్చలేదని విమర్శించారు. అయినా ప్రజలు వాటిని మరిచిపోయి 2024లో 140 హామీలు ఇస్తే నమ్మి ఓటు వేశారని పేర్కొన్నారు. గోబెల్స్ సిద్ధాంతాన్ని రాజకీయాల్లో ఉపయోగించుకునే ఏకైక వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. హామీలపై తాను చెప్పేది అబద్దాలని చంద్రబాబుకు తెలుసు అన్నారు. అయితే ప్రజలు నమ్మే విధంగా మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఈ ఏడాదిలో చంద్రబాబు ప్రజలకు ఏమీ చేయలేదని, ఎక్కడా అభివృద్ధి అనేది లేదని విమర్శించారు. అయినా ఏడాదికే రూ.1.70 లక్షల కోట్లు అప్పు చేశారని తెలిపారు.

టీడీపీ నేతలను ప్రజలు నిలదీయాలి

హామీలను నెరవేర్చకుండా చంద్రబాబు ప్రజలకు చేసిన మోసాలపై ఈ నెల 14 నుంచి మైదుకూరు నియోజకవర్గంలో ప్రతి మండలంలో సమావేశాలు నిర్వహిస్తున్నట్టు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని 16 లక్షల మందికి ఇంటి స్థలాలను ఇచ్చారని, 10 లక్షల ఇళ్లను మంజూరు చేశారని కొనియాడారు. ఏమి చేయకుండానే చంద్రబాబు ప్రజలను మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. 14వ తేదీ నుంచి మండల స్థాయి సమావేశాలు నిర్వహించి చంద్రబాబు చెప్పిన హామీలను గుర్తు చేసి ప్రజలను చైతన్యవంతులను చేస్తామన్నారు. సమావేశంలో ఉద్యాన శాఖ రాష్ట్ర మాజీ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ డి.శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు నేట్లపల్లె శివరాం, మైనారిటీ సెల్ అధ్యక్షుడు మదీనా దస్తగిరి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పి.కిరణ్మయి, నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో నియామకాలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లాకు చెందిన కింద తెలియజేసిన నాయకులను రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. స్టేట్ వలంటీర్స్ విభాగం జోనల్ అధ్యక్షులుగా దేరంగుల అఖిలేష్ (కడప), స్టేట్ మైనార్టీ విభాగం జనరల్ సెక్రటరీగా షేక్ అలీ అక్బర్ (కడప), స్టేట్ మైనార్టీ విభాగం అధికార ప్రతినిధిగా షేక్ గౌస్‌బాష (కడప), స్టేట్ మైనార్టీ సెల్ సెక్రటరీగా షేక్ షఫీవుల్లా (కడప), స్టేట్ పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శిగా చీర్ల సురేష్ యాదవ్ (కమలాపురం), స్టేట్ వైఎస్సార్ టీయూసీ అధికార ప్రతినిధిగా వైపీ సుదర్శన్ (కడప), స్టేట్ వైఎస్సార్ టీయూసీ కార్యదర్శిగా ఎస్.శివయ్య (బద్వేలు), స్టేట్ వైఎస్సార్ టీయూసీ జాయింట్ సెక్రటరీగా ఎ.రాము (పులివెందుల)లను నియమించారు.

ఉక్కు పరిశ్రమ శిలాఫలకాలకే పరిమితం



కోటిరెడ్డి సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న ఆర్‌సీపీ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం ముగ్గురు ముఖ్యమంత్రులు నాలుగు శిలాఫలకాలు వేశారే తప్ప, పరిశ్రమకు సంబంధించి ఒక్క ఇటుక కూడా పేర్చలేదని, ఉక్కుపరిశ్రమ శిలాఫలకాలకే పరిమితం అయిందని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి అన్నారు. శనివారం ఆర్‌సిపి 360 రోజుల ఉక్కు దీక్షలకు 8 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కోటిరెడ్డి సర్కిల్‌లో జిల్లాలో ఉక్కు పరిశ్రమ పనులను వేగవంతం చేసి, కూటమి ప్రభు త్వం పూర్తి చేయాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులలో జిల్లాలో ఉక్కు పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్న ఉక్కు సంకల్పమే వారికి ఉంటే 20 సంవత్సరాల కాలం అయినప్పటికీ నేటికీ శిలాఫలకాలకే పరిమితం అయిందని, ఈ రకంగా పనులు నిర్వహిస్తే ఉక్కు పరిశ్రమ ఎప్పటికి పూర్తవుతుందో పాలకులు చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో ప్రసాద్, చాపల సుబ్బరాయుడు, లక్ష్మీదేవి, తస్లీమ్, వెంకటేశు, రవి, విజయ్, ప్రతాపరెడ్డి,ముని రెడ్డి, రాజు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి



విద్యుత్ భవన్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పిన సీఎం చంద్రబాబు నాయుడు అవేమీ పట్టించుకోకుండా విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో జనం పై భారాలు మోపుతున్నారని, ఇదే తరహాలో కూటమి ప్రభుత్వం పయనిస్తే బషీర్ బాగ్ తరహా విద్యుత్ ఉద్యమం తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు. శనివారం విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యుత్ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా విద్యుత్ భవన్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది కాలంలో విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్ల భారం ప్రజలపై మోపిందన్నారు. అంతేగాక గృహాలకు స్మార్ట్ మీటర్ల ను బిగించేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదని, కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలు ఇచ్చి విద్యుత్ చార్జీల భారాలను మోపటం ప్రజలను దారుణంగా మోసగించడమేనన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి యన్ వెంకటశివ, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు నాగార్జున రెడ్డి, మునయ్య, శంకర్ నాయక్, భాగ్యలక్ష్మి, రామ్మోహన్ రెడ్డి, శివ నాగేంద్ర, అరుణ్, శివతేజ పాల్గొన్నారు.

పాఠశాల స్థాయిలో బాలల రక్షణ కమిటీల ఏర్పాటు



రిమ్స్‌లో వైద్య సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకుంటున్న పద్మావతి

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాలల రక్షణకు పాఠశాల స్థాయి రక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి సూచించారు. శనివారం కడప నగరంలోని కలెక్టరేట్ సభా భవనంలో బాలల రక్షణ, బాలల హక్కులు అంశాలపై విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా సంస్థలు పిల్లల భద్రత, బాల కార్మిక వ్యతిరేకత, బాల్య వివాహాల నివారణ, డ్రాపౌట్ విద్యార్థుల పునః ప్రవేశం, విద్యార్థుల పట్ల లైంగిక వేధింపుల నివారణ వంటి అంశాల్లో కీలక పాత్ర పోషించాలన్నారు. పాఠశాల స్థాయిలో రక్షణ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. మత్తు పదార్థాల నిరోధానికి ప్రతి పాఠశాలలో ప్రహరీ క్లబ్‌ను ఏర్పాటు చేసి ప్రతినెల తప్పనిసరిగా సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నెంబరును ప్రతి పాఠశాలలో గోడల మీద పెయింటింగ్ వేయాలని తెలిపారు. అనంతరం కమిషన్ సభ్యురాలు రిమ్స్ ఆస్పత్రిని సందర్శించి లైంగిక వేధింపుల కేసులలో మెడికల్ టెస్టు కోసం రిమ్స్‌కు వచ్చే బాలల కోసం ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే కేంద్రీయ విద్యాలయాన్ని సందర్శించి ప్రిన్సిపాల్‌కు తగు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఎంఈఓలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల హెచ్‌ఎంలు, కేజీబీవీ ప్రిన్సిపాళ్లు, మోడల్ స్కూళ్లు, బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, ప్రైవేటు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు తగదు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: విద్యుత్ మీటర్లను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం దారుణమని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఇందిరాభవన్‌లో విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలపై బాదుడు విధించే విధంగా తీసుకుంటున్న చర్యలను తీవ్రంగా ఖండించారు. ఇటీవల రాష్ట్రంలో అమలవుతున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విద్యుత్ చార్జీల భారీ పెంపు పై ఆందోళన వ్యక్తం చేస్తున్నామన్నారు. వెంటనే స్మార్ట్ మీటర్ల అమలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పట్ల నిర్లక్ష్యాన్ని వీడి సత్వరమే పరిష్కరించేలా చూడాలని ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య డిమాండ్ చేశారు. డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఇ.రాము, జి.బాల వెంకటేశ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో భాగంగా శనివారం యూనియన్ నాయకులు, ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సుదీర్ఘకాలంగా ఆందోళనలు నిర్వహిస్తున్నా పట్టించుకోకపోవడం తగదన్నారు. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, కాలం చెల్లిన బస్సుల బ్రేక్‌డౌన్‌కు గ్యారేజీ సిబ్బందిని బాధ్యులను చేసి అక్రమ ఛార్జిషీట్లు ఇచ్చే విధానాన్ని నిలుపుదల చేయాలన్నారు. వీటితోపాటు ఇతర అనేక అపరిష్కృత సమస్యలను ప్రభుత్వం, యాజమాన్యం పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.రామ్మూర్తి, రాయపాటి బాలసుబ్రమణ్యం, హుసేన్, సురేష్, శ్రీను, గణేష్ సింగ్, బండి చెన్నయ్య, మహిళా విభాగం కో చైర్ పర్సన్ శారదాదేవి, మస్తానమ్మ, సి.లక్ష్మిదేవి, లక్ష్మి, రాణి, రామలక్షుమ్మ, పద్మావతి, ట్రాఫిక్ విభాగానికి చెందిన ఏఎస్ రెడ్డి, ట్రెజరర్ వినోద్‌బాబు, ఎంవీ సుబ్బయ్య, పీవీ సుబ్బయ్య పాల్గొన్నారు.

నేడు తొలి ఏకాదశి

- భక్తుల ఉపవాసాలు, విశిష్ట పూజలు
- పీఠాధిపతుల చాతుర్మాస దీక్షలు
- శ్రీ మహావిష్ణువు యోగ నిద్ర

కడప సెవెన్‌రోడ్స్ : తొలి ఏకాదశి హిందువులకు ఆనందం పంచే పండుగ. దీని తర్వాత ఉగాది వరకు ప్రతినెల కనీసం ఒక పెద్ద పండుగ వస్తుంది. అందుకే దీన్ని తొలి పండుగగా పేర్కొంటారు. ఆదివారం తొలి ఏకాదశి పర్వదినాన్ని జిల్లాలోని ఆలయాల్లో ఘనంగా నిర్వహించనున్నారు. ఇప్పటి నుంచి 18 రోజుల తర్వాత శ్రావణమాసం ప్రారంభమవుతుంది. ఈ మాసంలో శుభ కార్యాలు, వివాహాలు, ప్రారంభోత్సవాలు ఎక్కువగా నిర్వహిస్తారు. అందుకే తొలి ఏకాదశి శుభదాయకమైనదని హిందువులు విశ్వసిస్తారు.

మాస విశిష్టత

ఈ మాసంలో శ్రీ మహా విష్ణువు యోగ నిద్ర ప్రారంభిస్తారని పురాణాల ద్వారా తెలుస్తోందని పెద్దలు చెబుతారు. ఇటు నిద్ర, అటు మెలకువ కాని స్థితినే యోగ నిద్ర అంటారని వైదిక కాలం నాటి మహా ఋషులు, యోగులు తరుచూ ఈ యోగ దీక్ష చేపట్టే వారని కూడా చెబుతారు. ఈ దీక్షలో అలౌకిక ఆనందం, మానసిక సౌఖ్యాన్ని పొందవచ్చని వారు తెలుపుతున్నారు. ప్రస్తుత రోజుల్లో యోగా గురువులు కూడా పలు శారీరక, మానసిక రుగ్మతల నుంచి దూరమయ్యేందుకు శిష్యులతో ఈ యోగ నిద్రను సాధన చేయిస్తున్నారు. అలసట, బద్ధకం, అనారోగ్యం తొలగిపోయి కర్తవ్యాన్ని హుషారుగా నిర్వహించే శక్తిని యోగ నిద్ర ప్రసాదిస్తుందని యోగ గురువులు పేర్కొంటున్నారు. ఈ శక్తిని అందరూ ఆస్వాదించాలన్నదే శ్రీ మహావిష్ణువు యోగ నిద్ర పరమార్థమని తెలుపుతున్నారు. ఆషాఢశుద్ధ ఏకాదశినే తొలి ఏకాదశి అంటారు. యోగ నిద్రలోకి వెళ్లే విష్ణుమూర్తి తిరిగి కార్తీక శుద్ధ (ఉత్థాన) ఏకాదశి నాడు నిద్ర లేస్తారన్నది పురాణ కథనం.

ప్రత్యేక పూజలు

ఈ సందర్భంగా వైష్ణవాలయాలన్నీ భక్తులతో కళకళలాడతాయి. అన్ని ఆలయాలలో విష్ణు సహస్ర నామ పారాయణం చేసి ఉపవాస దీక్షతో రాత్రంతా జాగరణ చేసి ఉదయం స్నానానంతరం తిరిగి విష్ణుమూర్తికి విశేష పూజలు చేయాలన్నది తొలి ఏకాదశి పూజా విధానాలలో ఒకటి. ఈ సందర్భంగా విష్ణుమూర్తిని తులసీ దళాలతో పూజలు చేస్తే మోక్షం లభిస్తుందని విశ్వాసం. గో పూజలు నిర్వహించడం మంగళదాయకమని భావిస్తారు.

దీక్షలు

వైష్ణవులు ఎంతో పవిత్రమైనదిగా భావించే తొలి ఏకాదశి నుంచి నాలుగు మాసాలపాటు పీఠాధిపతులు దీక్షలు వహిస్తారు. వాటినే చాతుర్మాస దీక్షలుగా పేర్కొంటారు. ఎండల నుంచి చలికి మారే వాతావరణాన్ని, ఆపై కొన్ని నెలలపాటు వచ్చే చలిని భరించేందుకు శిక్షణగా గురువులు ఈ దీక్షలు వహిస్తారని పెద్దలు చెబుతారు.

9న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



నగరంలో స్కూటర్ ర్యాలీ చేస్తున్న వామపక్ష కార్మిక సంఘాల నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 9న తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జిల్లాలో జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి మనోహర్ యూటీయూసీ జిల్లా నాయకులు సుబ్బరాయుడు, టీయూసీ నాయకులు రమణయ్య పిలుపునిచ్చారు. శనివారం ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కడప నగరంలోని స్థానిక సెవెన్ రోడ్స్ దగ్గర ఉన్న ఆర్టీఓ ఆఫీస్ దగ్గర నుండి స్కూటర్ ర్యాలీ పెద్ద ఎత్తున ప్రారంభించి ఎస్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, ఎర్రముక్కపల్లి సర్కిల్, మహావీర్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గుంటి వేణుగోపాల్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే శ్రీనివాసులు రెడ్డి, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె.మద్దిలేటి పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



రక్త వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సమాజంలో రక్తం అవసరాన్ని గుర్తించి ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలని వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తెలిపారు. శనివారం కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు జరిగే ‘రెండవ రక్త వారోత్సవాల’ పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎంతో మంది ప్రాణాలు నిలబెట్టవచ్చని, ఇది ఒక గొప్ప సామాజిక సేవ అన్నారు. రక్తదానం చేయడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్న విషయాన్ని గుర్తించాలని వారు సూచించారు. నేటి యువత అపోహలు వీడి రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవ్యక్తికి ప్రాణదానం చేయాలని వారు కోరారు. ప్రభుత్వ శాఖలు కూడా స్వచ్ఛంద సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలకు తమవంతుగా తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేబీవీఎస్, , విక్షిత ఫౌండేషన్, చేతన ఫౌండేషన్, శ్రీ జ్యోతిబాయ్ పూలే సేవా సమితి, అమృత హస్తం సేవాసమితి, సిఆర్‌ఐ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్, కేర్ క్లబ్ ఫౌండేషన్, వింగ్స్ ఆఫ్ హ్యూమానిటీ సంస్థల ప్రతినిధులు అశోక్, అరవింద్, సుబ్బయ్య, నవీన్, సునీల్, దుర్గ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలి

కడప రూరల్: తిరుపతి ఇందిరా మైదానంలో ఈనెల 6వ తేదీన నిర్వహించే రాష్ట్రస్థాయి బీసీ ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్ లింగమూర్తి, గోవిందు నాగరాజు తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రులు హాజరవుతారని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

తరగతులు నిర్వహించకుండా పరీక్షలా..?



వైవీయూ పరిపాలన భవనం ఎదుట ధర్నా చేస్తున్న ఆర్‌ఎస్‌ఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బి.ఎడ్, లా కళాశాల విద్యార్థులకు తరగతులు నిర్వహించకుండానే పరీక్షలు ఎలా నిర్వహిస్తారని ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డి.యం. ఓబులేసు యాదవ్ ప్రశ్నించారు. శనివారం వైవీయు పరిపాలన భవనం ఎదుట ఆర్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ అంశంపై తక్షణమే అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే భారీగా ఆందోళనలకు సిద్ధం అవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్. ఎస్. ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, నాయకులు సాహెబ్, సమీర్, అర్జున్, మనసుర్, బాబాయ్య పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలి

కడప ఎడ్యుకేషన్: చిన్నతనం నుంచే విద్యార్థులకు ఆధ్యాత్మిక బోధనలు అందించినప్పుడు సత్ప్రవర్తన గుణములతో మంచి మార్గంలో పయనిస్తారని జెకె జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పటాన్ ఖాదర్ బాషా అన్నారు. కడప నగరంలోని అల్మాస్‌పేటలో జెకె జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వారి ఆధ్వర్యంలో మొహర్రం సందర్భంగా మద్రాస ఏ సిరాజుల్ ఉలూమ్‌లో విద్యార్థులకు ఖురాన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మదరసా వ్యవస్థాపకులు హజరత్ మౌలానా మౌల్వి భకీర్ సాహెబ్, జాకీర్, రెహమాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

దళితుడిని కుక్కతో పోల్చిన సీఎం క్షమాపణ చెప్పాలి

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు

కడప కార్పొరేషన్: గుంటూరు జిల్లా సత్తెనపల్లెలో ప్రమాదవశాత్తు మరణించిన దళితుడు సింగయ్యను ముఖ్యమంత్రి చంద్రబాబు కుక్కతో పోల్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షుడు సింగమాల వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సీఎం వ్యాఖ్యలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ రామక్రిష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని వ్యాఖ్యానించి దళితులను అవమానించారని, ఆయన ప్రభుత్వంలో ఉన్న మంత్రులు మురికివాడలో పుట్టిన వారి ఆలోచనలు మురికిగానే ఉంటాయని.. దళితులు చదువుకోరు, శుభ్రంగా ఉండరని అవహేళన చేశారని గుర్తు చేశారు. ఈ వ్యాఖ్యలను బట్టే చంద్రబాబుకు, వారి పార్టీ నాయకులకు దళితులపై ఉన్న కపట ప్రేమ ఏమిటో అర్థమవుతుందన్నారు. దళితుడైన సింగయ్య మరణాన్ని చంద్రబాబు తన రాజకీయ లబ్ధికోసం వాడుకోవడం హేయమైన చర్యగా తాము భావిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఆయన ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగయ్య మరణంపై విచారణ జరిపించి వాస్తవాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు, నగర ఉపాధ్యక్షుడు వై. రవికుమార్, నగర ప్రధాన కార్యదర్శి ఎస్.నరసింహసాయి పాల్గొన్నారు.